

సార్వత్రిక సమ్మె విజయవంతం 6లో..
నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సహకరించాలి 6లో..



# మామిడి పూత ఆలస్యం

## దిగుబడిపై ఆందోళనలో రైతులు

- వాతావరణంలో మార్పులే ప్రభావం
- మామిడి సాగులో రాష్ట్రంలో జగిత్యాల జిల్లా రెండో స్థానం
- జిల్లా వ్యాప్తంగా 36,315 ఎకరాల్లో సాగు

జగిత్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతును ప్రకృతి పగబడుతోంది. ఫలరాజంపై వాతావరణంలో మార్పులు కారణంగా ఈ యేడాది సైతం పూతలు రావడం ఆలస్యం అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో చీడపీడలు అధికంగా ఉండడంతో వచ్చిన పూత కూడా పిందగా మార కుండానే రాలిపోతోంది. ఉష్ణోగ్రతలో హెచ్చు తగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సాధారణం కంటే మామిడి పూత ఆలస్యంగా వస్తుండడంతో రైతుల్లో దిగులు నెలకొంది. అధిక వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులు మామిడిపై ప్రభావం చూపుతున్నాయి.

సుమారు ఇరవై నుంచి ముప్పయి రోజుల పాటు ఆలస్యంగా మామిడి పూత వస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పూత రాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో పూత నుంచి పింద దశలో ఉండడం, ఇంకొన్ని ప్రాంతాల్లో పూత రాలుతుండడం వంటివి చోటుచేసుకున్నాయని రైతులు అంటున్నారు. దీనికి తోడు అక్కడక్కడ మామిడి పంటపై తేనే మంచు పురుగు దాడి చేస్తోంది. పూతను రాల్చే రకం పురుగు సోకడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలో మామిడిని అధికంగా సాగు చేసే జిల్లాల సరసన జగిత్యాల జిల్లా ఉంటుంది.

### రాష్ట్రంలో 2,91,388 ఎకరాల్లో సాగు..

రాష్ట్రంలో ప్రస్తుత సీజన్‌లో 2,91,388 ఎకరాలల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 46 వేల ఎకరాలకు పైగా మామిడి సాగును చేసి నల్గొండ జిల్లా ప్రథమస్థానంలో ఉండగా, 36,315 ఎకరాల్లో సాగు చేస్తూ జగిత్యాల జిల్లా రెండవ స్థానంలో ఉంది. ఆ తరువాతి స్థానం నాగర్ కర్నూల్, ఖమ్మం తదితర జిల్లాలున్నాయి. ఈసారి ఏకరాకు 3 నుంచి 3.5 టన్నుల వరకు దిగుబడి రావచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడి విపరీతంగా పడిపోతూ వస్తుండటం, మార్కెటింగ్ సమస్యల వంటి కారణాలతో మామిడి తోటల వల్ల లాభం లేదని రైతాంగం భావిస్తోంది. ఇప్పటికే చాలా మంది రైతులు మామిడి తోటలను తొలగించి, అదే స్థలంలో మొక్కజొన్న, నువ్వులు వంటి ఇతర పంటలను సాగు చేస్తున్నారు. వచ్చిన మామిడి దిగుబడిని మార్కెట్‌లో విక్రయిద్దామనుకుంటే అక్కడా గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పెట్టుబడులు సైతం రాక అన్నదాత నష్టాల పాలు కావాల్సి వస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో జిల్లాలో మామిడి ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### సహకరించని వాతావరణ పరిస్థితులు...

జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడి వాతావరణ పరిస్థితులు సహకరించడం లేదు. ప్రతీయేటా డిసెంబరు మూడో వారం, జనవరి తొలి, మలి వారం నాటికి పూర్తి స్థాయిలో పూత వస్తుంది. జనవరి, ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడి తదుపరి కాయలు వస్తాయి. ప్రస్తుత సీజన్‌లో అధిక వర్షాలు పడడం, రాత్రి వేళలో చలితీవ్రత పెరగడం, తెగుళ్ల ప్రభావం వల్ల ప్రస్తుతం పూత ఆశించిన మేరకు రాలేదు. శాస్త్రవేత్తల సలహాలతో కొంత మేర ప్రయోజనం ఉన్నా రైతులంతా వాటిని పాటించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మామిడికి అక్కడక్కడ సోకిన తేనే మంచు, బూడిద రంగు తెగులు, తామర తెగులు కారణాల వల్ల మామిడి రైతులు దిగులు చెందుతున్నారు.

### మామిడి తోటలపై ప్రకృతి ప్రభావం...

మామిడి తోటలపై ప్రకృతి ప్రభావం ఎంతగానో ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి వల్ల పూత, కాపుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒక్కో చెట్టుకు ఆడ, మగ పూత ఉంటుంది. సుమారు పదివేల మగపూత ఉంటే, ఒక ఆడపూత కాయగా మారుతూ ఉంటుంది. అయితే ప్రస్తుత సీజన్‌లో కురిసిన అధిక వర్షాలు, రాత్రి చలిగా, పగలు పెరిగిన ఉష్ణోగ్రతల కారణం గా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలున్నాయి. మామిడి పంటకు గత నవంబర్, డిసెంబర్ నెలల్లో పచ్చ పురుగు, దోమపోటు పు రుగు వంటివి సోకడంతో కాస్త ఇబ్బందులు పడిన రైతులు వెంటనే గు ర్తించి, వాటి నివారణకు తగిన పురుగు మందులను పిచికారి చేశారు. పూ త, కాత దశల్లో పలు పర్యాయాలు మందు స్ప్రే చేశారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడి పంటకు అక్కడక్కడ బూడిద తెగులు, తేనేమం చు తెగుళ్లు ఆశిస్తున్నాయి. రాత్రి పూట చలి ఎక్కువగా ఉండడం వల్ల తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

### దిగుబడిపై దిగులు...

మామిడి పంటకు తెగుళ్లు సోకడం వల్ల మునుముందు మామిడి కాయల దిగుబడి తగ్గుతుందన్న ఆందోళనలో రైతాంగం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రతీ యేటా సుమారు రూ. 400 కోట్ల మామిడి వ్యాపారం జరు గుతుంటుంది. ఇక్కడ నుంచి మామిడి కాయలను ముంబాయి, బెం గుళూరు, చైన్నయి, డిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. అనేక వ్యయ ప్రయాలసకోర్చి మామిడిని మార్కెట్‌ను తీసుకవెళ్లితే గిట్టు బాటు ధర లభించని పరిస్థితిని రైతాంగం ఎదుర్కొంది. మామిడికి మద్దతు ధరను ప్రకటించమని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

### సస్యరక్షణ చర్యలు చేపడితే నివారణ సాధ్యం...

మామిడిలో సస్య రక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల ఉధృతి నుంచి పంట ను రక్షించుకోవచ్చునని అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. తేనె మంచు పురుగు నివారణకు క్లోరిఫైరిపాస్, ఇమిడాక్రోప్రిడ్ మందులను ఉధృతిని బట్టి శాస్త్రవేత్తల సల హాల మేరకు పిచికారి చేయాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. పూత రావ డానికి సైతం ప్రత్యేకంగా సస్య రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

### వాతావరణ మార్పులతోనే దిగుబడిపై ప్రభావం

**లంబ లక్ష్మణ్, మామిడి రైతు, శ్రీరాములపల్లె**



ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా పూత, కాతపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందాల్సి వస్తుంది. ముందుగా పూతకు వచ్చిన తోటలకు పెద్దగా ఇబ్బందులేమి లేకపోగా, పూత ఆలస్యంగా వచ్చిన తోటల్లో మాత్రం దిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నాయి.

### మామిడి రైతులను సర్కారు ఆదుకోవాలి

**అబ్దుల్ ఖదీర్, మామిడి రైతు, పోరుమల్ల, మేడిపల్లి మండలం**



వాతావరణంలో మార్పులు కారణంగా మామిడి సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ప్రస్తుత సీజన్‌లో మామిడి పూత ఆలస్యంగా వచ్చింది. వచ్చిన పూత పిందెగా మారకుం డానే రాలిపోతోంది. కొన్ని చెట్లకు పిం దెలు నిలిచినప్ప టికీ రానున్న వేసవిలో ఎండ వేడి కారణంగా దిగుబడి పై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి**



జిల్లాలో మామిడి పూత ఆలస్యంగా వస్తోంది. ప్రస్తుతం పూత పిందెగా మారే దశలో మామిడి ఉంది. పలు ప్రాంతాల్లో పిందె దశకు మామిడి చేరుకుంటుంది. జిల్లాలో మామిడికి అక్కడక్కడ కనిపిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. రాత్రిపూట ఉష్ణోగ్రతల కారణంగా పూత దశకు రావడంలో కొంత ఆలస్యం ఏర్పడుతుంది. తామర తెగులు, తేనె మంచు, బూడిద రంగు తెగుళ్ల నివారణకు ఉధృతిని బట్టి శాస్త్రవేత్తల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.

## కోరుట్లలో కట్టడాల కూల్చివేత

- పోలీసు పహారా మధ్య రెవెన్యూ యంత్రాంగం చర్య
- సీపీఎం నేతల నిరసన, అరెస్ట్



కోరుట్లలో కట్టడాలు కూల్చివేస్తున్న అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 16 : పట్టణ శివారలోని జంబిగద్దె ప్రాంతంలో శ్రీవెంక టేశ్వరస్వామి ఆలయ భూముల్లో పేదలు నిర్మించుకున్న గుడిసెలు, ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వేకువజామున పోలీసు పహారా మధ్య 923 సర్వే నంబర్‌లో నిర్మించుకున్న సుమారు 80 ఇళ్లను ఎక్సావేటర్ సహాయంతో కూల్చివేశారు. ఆరు మాసాలుగా ఇక్కడ పేదలు తాత్కాలికంగా గుడిసెలు వేసుకోవడంతో పాటు పక్కా ఇళ్లను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్నారు. ఈ కట్టడాలు అక్రమమని పేర్కొంటూ రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. నిరుపేదల ఇళ్లను కూల్చి వేసి విలువైన వస్తువులను నాశనం చేశారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్లు, కుట్టుమిషన్లు, వాహనాలు, వంట సామగ్రి బయట పడేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. కూల్చివేసిన స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సీపీఎం నేతలను అరెస్ట్ చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లు లక్ష్మీ, కరీంనగర్ సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సీపీఎం నాయకులు చౌదరి, రమేశ్, చెన్న విశ్వనాథం ఉన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

### ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



కళాబృందం సభ్యులతో ఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16 : పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పోలీస్ కళా బృందం సభ్యులకు నూతనంగా రూపొందించిన డ్రెస్‌లను ఎస్పీ చేతుల మీదుగా అందజేసి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుదలతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. సైబర్ నేరాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమరాల ప్రాముఖ్యత, మూఢ నమ్మకాల నివారణ, 100 డయల్ ప్రాధాన్యతపై వివరించాలన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్‌ఐలు జానిమియా, రామకృష్ణ ఉన్నారు.

## ఒకే రోజు రెండు అరుదైన శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్స ద్వారా తొలగించిన కణితితో వైద్యులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలో ఒకే రోజు రెండు ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యులు రెండు అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించి రోగుల ప్రాణాలను కాపాడారు. జిల్లాలో బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన సాగర్ యూరిన్ బ్లాడర్‌లో ఉన్న రాయితో బాధపడుతున్నాడు. స్థానిక జంబిగద్దె ప్రాంతంలో ఉన్న ఏటీఎం ఆసుపత్రిలోని వైద్యులు సురేష్, కళ్యాణ్ బృందం రాయిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా జన్నారం ప్రాంతానికి చెందిన ఓ 50 ఏళ్ల మహిళ కడుపునొప్పితో పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో ఉన్న శ్రీకర ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వహించగా కడుపులో కణితి ఉన్నట్టు గుర్తించారు. వైద్యులు శ్రీకాంత్, నాగరాణిల బృందం కడుపులో ఉన్న ఏడు కిలోల కణితిని తొలగించారు.

## ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణం

ధర్మపురి, ఫిబ్రవరి 16: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో గడిసందుల వంశం వారి ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి అర్చకులు వొద్దిపర్తి సంతోషాచార్యులు, కృష్ణయజుర్వేద పండితులు డింగిరి హేమంతచార్యులు శాస్త్రోక్తంగా, విధి విధానంగా కళ్యాణోత్సవం జరిపించారు. అనేక మంది భక్తులు కళ్యాణోత్సవాన్ని తిలకించి, స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గడిసందుల వంశీయులు గడిసందుల దుబ్బయ్య, భూమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, మండల ఎస్‌సీ సెల అధ్యక్షులు కట్ట భువనేశ్వర్, లక్ష్మణ్, గంగాధర్ పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

రాయికల్, ఫిబ్రవరి 16: రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిలపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో నర్సింహా మూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక సమావేశానికి 12 మంది సభ్యులకుగాను ప్రతిపక్షానికి చెందిన ఇద్దరు సభ్యులు హాజరైనట్లు తెలిపారు. దీంతో చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిలపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లయింది. దీంతో గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెర పడినట్లయింది.

### వైస్ చైర్మన్ మహిళ అని అవిశ్వాస తీర్మానం పెట్టారా

రాయికల్ మున్సిపల్ వైస్ చైర్మన్ మహిళ కాబట్టే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారా అని రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మ్యాకల అనురాధ అన్నారు. అవిశ్వాస తీర్మానం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠత రేగిందని, తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు ఒకే పార్టీకి చెందిన ఒకే కుటుంబంలో ఉండేవారని అన్నారు. వాళ్లు ఏమి ఆశించి అవిశ్వాసం పెట్టారో ప్రజలకు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి గత మూడు సంవత్సరాలుగా వారికి నచ్చడం లేదని, వైస్ చైర్మన్ మహిళ కాబట్టే ఓర్వడం లేదా అని ప్రశ్నించారు. వారికి వ్యతిరేకంగా తీర్మానం పెట్టి మళ్లీ వెనక్కి తగ్గడం వెనక రాజకీయ లబ్ధి, స్వప్రయోజనాలు ఏమున్నాయో ప్రజలకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చెప్పాలని డిమాండ్ చేశారు.

### స్వార్థ ప్రయోజనాల కోసమే అవిశ్వాసం నాటకం

రాయికల్ మున్సిపల్‌లో స్వార్థ ప్రయోజనాల కోసమే అవిశ్వాసం నాటకం ఆడారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ సునీత అన్నారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వలాభం కోసం అవిశ్వాస తీర్మానాన్ని తెరపైకి తెచ్చారన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రస్తుతం కనిపించడం లేదని, మీడియాలో గోవా వార్త కథనాలు రాజకీయాలను మరింత దిగజార్చి అభివృద్ధి చేయడం చేతగాక ఇలాంటి నాటకాలకు పురిగొల్పుతున్నారని అన్నారు. పట్టణ ప్రజలు భవిష్యత్ ఎన్నికలలో అభివృద్ధికి ఆటంకంగా మారి లాభాల కోసం స్వార్థంగా వ్యవహరించే ఈ నాయకులను ఆదరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుర్మ మల్లారెడ్డి, రవి, సుమన్, బన్న సంజీవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

## ఎమ్మెల్సీని కలిసిన జగిత్యాల డీఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16 : ఇటీవల బాధ్యతలు చేపట్టిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి బద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని డీఎస్పీ పేర్కొన్నారు.

## పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దు

వెల్గటూర్, ఫిబ్రవరి 16: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. కమీషనర్ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు కోటిలింగాల లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలలో ఎస్ఎస్‌సీ, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించడానికి అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో సమయంలో విద్యార్థులు సెల్ ఫోన్‌లు ఉపయోగించ వద్దని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా మంచి పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. చాప కింద నీరులా ప్రవహిస్తున్న డ్రగ్స్‌కు విద్యార్థులు బానిసలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## యువత రక్తదానం చేయాలి

### ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్

కొడిమ్యాల, ఫిబ్రవరి 16 : యువత, విద్యార్థులు రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకో వాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. కామాక్షిప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విద్యార్థి సూర్యతేజ ( ట్రిపుల్ ఇ నాలుగవ సంవత్సరం విద్యార్థి) స్మా రకార్థం ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసై టీ సంస్థ, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ సంయు క్తంగా రక్తదాన శిబిరం నిర్వహించగా ప్రిన్సిపాల్ ప్రారంభించారు.

ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం చేయ టం వల్ల ఒకరి ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు రక్తదానం చేయాలన్నారు. ఈ శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాల్, హాస్టల్ మే నేజర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా కా ర్యదర్శి రాధాకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్. కోఆర్డీనే టర్ ప్రవీణ్‌కుమార్, టాటా ఏఐ ఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ సుర రామకృష్ణారెడ్డి, టాటా ఏఐఏ అడ్వైజర్లు రవీందర్, హరేందర్, గోపాల్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

# ధర్మపురిలో ఘనంగా రథ సప్తమి వేడుకలు



సూర్య భగవానుడికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

ధర్మపురి, ఫిబ్రవరి 16: ధర్మపురి క్షేత్రంలో రథ సప్తమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూర్య భగవానుడి జన్మదినం పురస్కరించుకుని ఉదయం వేళలో అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. సూర్య భగవానుడికి అర్ఘ్యం వదిలారు. పుణ్య కాలంగా భావించిన భక్తులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. కొందరు ఉపవాస దీక్షలు చేపట్టారు. గోదావరి నది స్నానఘట్టాల వద్ద సైకత లింగాలు ఏర్పాటు చేసి జలంతో అభిషేకం జరిపి పూజించారు. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలను భక్తులు సందర్శించారు.

### నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహుని సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఆలయాల్లో అందంగా పూలతో అలంకరణ చేసిన స్వామి వారలకు వేదపండితుల్లో బొజ్జ రమేష్‌శర్మ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ధర్మపురి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జగిత్యాల టౌన్** : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న సూర్య భగవాన్ ధనలక్ష్మీ సహిత దన్వంతరి దేవాలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలను వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూర్య భగవానుడి విగ్రహానికి ఎమ్మెల్యే సతీమణి రాధికతో పాటు భక్తులు క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పట్టణంలోని టీట్‌బజార్, వాణినగర్‌ల మీదుగా ఆంజనేయ స్వామి, శివాలయం వరకు స్వామి వారి శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శంకర్, రాజన్న, రామచంద్రం, రాజేందర్, నాగరాజు, గుండేటి రాజు ఉన్నారు.

**మల్లాపూర్** : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వాల్గొండ రామలింగేశ్వరాలయం, మొగిలిపేట మహాదేవలయాల్లో లోక కల్యాణార్థం మృత్యుంజయ హోమం, ఆదిత్య సహిత రుద్ర హోమం వంటి కార్యక్రమాలను పురోహితులు సజ్జనపు జనార్ధన్‌చారి భక్తులచే జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.



ధర్మపురిలో సూర్య భగవానుడికి అర్ఘ్యం వదులుతున్న భక్తుడు

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

**● లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు**

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లా స్థాయి ఆర్థిక అక్షరాస్యత వారోత్స వాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 'నేను రాత్రి పూట మిలినీయర్‌గా మారినట్లయితే, నేను ఆ డబ్బును ఎలా ఉపయోగించగలను' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని, 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ బాషల్లో రాయవచ్చని అన్నారు. 'సమ్మేళనం యొక్క పొదుపు, శక్తి' అనే అంశంపై నినాదాల పోటీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆంగ్లం, తెలుగు, హిందీ బాషల్లో ఉంటుందని అన్నారు. పోస్టర్ పోటీ 'డిజిటల్, సైబర్ పరిశుభ్రత అనే అంశంపై చేతితో డ్రా లేదా డిజిటల్‌గా కానీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో వేయవచ్చని అన్నారు. పాల్గొనే వారి పేరు, పాఠశాల, కళాశాల పేరు, పబ్లిక్, ప్రైవేట్, పాల్గొనే వారి వయస్సు, కాంట్రాక్టు నెంబర్ పార్టిసిపెంట్/గార్డియన్‌ది పేరు దరఖాస్తుల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మూడు పోటీల్లో విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం, రాష్ట్రస్థాయిలో బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 22 సాయంత్రం 5 గంటలలోపు కేఎస్ఆర్ లీడ్‌బ్యాంక్ ఈమెయిల్‌కు వ్యాసం, నినాదం, పోస్టర్‌లను పంపించాలని సూచించారు.

## హైకోర్టు ఎదుట హాజరైన కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ బాధితురాలు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసిన వ్యవహారంలో కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో హైకోర్టు ఎదుట హాజరయ్యారు. కరీంనగర్‌లో ఓ జడ్జి కొడుకుపై ఉద్యోగం కోల్పోయిన ఆఫీస్ సబార్డినేట్ ఆరోపణలకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టుకు అందజేశారు. తాము ఆదేశించినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై సదరు ఎస్‌హెచ్‌వోపై రెండురోజుల కింద హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌వో శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఫిర్యాదుదారు (పిటిషనర్) ప్రవర్తన సైతం బాగాలేకపోవచ్చు.. ఉద్యోగం పోయిన తర్వాతే ఆమె ఫిర్యాదు చేసి ఉండొచ్చు. కానీ ఆ అంశాల మెరిట్స్‌పై మేం ఎలాంటి వ్యాఖ్య చేయడం లేదు. అవన్నీ దర్యాప్తులో తేలాలి. కానీ నమోదు చేయదగ్గ నేరానికి (కాగ్నిజబుల్ అఫెన్స్) సంబంధించి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం తీవ్రమైన అంశం. ఒక మహిళ పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు వస్తుంది. అది టూరిస్టు కేంద్రం లేదా సినిమా థియేటర్ కాదు కదా? ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు వేచి ఉంచి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పడం సరికాదు. పౌరులు ఎలాంటి భయం లేకుండా పోలీస్‌స్టేషన్ వచ్చేలా వర్క్‌షాప్ పెట్టేలా డీజీపీకి సూచించండి' అని ధర్మాసనం పేర్కొంది. ఫిర్యాదు చేసినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయక పోవడానికి కారణాలను వివరిస్తూ లిఖితపూర్వక వివరణ సమర్పించాలని సదరు పోలీసు అధికారికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

## తండ్రిని హతమార్చిన తనయుడు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట్ గ్రామానికి చెందిన యాదగిరి ఓదెలు (55)ను అతని కుమారుడు రాజు కత్తితో పొడిచి హత్య చేసాడు. సంఘటనపై సమాచారం అందుకున్న పెద్దపల్లి ఏసీపీ ఎ.కృష్ణ, పెద్దపల్లి సీఐ కృష్ణ, పెద్దపల్లి ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## పాఠశాల విద్యార్థులకు 'స్నేహిత' అవగాహన కార్యక్రమం

తిమ్మాపూర్, ఫిబ్రవరి16: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మండలంలోని రామకృష్ణ కాలనీలో గల గన్నేరువరం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు స్నేహిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రూరల్ సీడీపీఓ సబితా ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. న్యూట్రిషన్ ఫుడ్, బాల్య వివాహాలు, బాల బాలికలు యుక్త వయస్సులో మార్పుల వలన తెలిసి తెలియక తప్పుతోవ పడుతున్నారని అన్నారు. మంచి లక్ష్యం ఏర్పాటు చేసు కొని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన ఉండాలని, స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు గురి కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఏసిడిపివో అరవింద, ప్రిన్సిపాల్స్ వామన్ రావు, మధుసూధన్, సూపర్‌వైజర్లు శ్రీలత, పద్మ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, సోషల్ వర్కర్ రమేష్, ఏఎన్ఎం రోజా, షీ టీం విజయమణి ఉన్నారు.

## సమ్మక్క జాతరకు ఆర్టీసీ ఆర్ఎం గేట్‌మీటింగ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: ఈ నెల 18 నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరంచుకుని శుక్రవారం ఆర్టీసీ కరీంనగర్‌రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే మేడారం జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని ప్రయాణ అనుభూతిని కల్పించి వారి మన్ననలు పొందాలన్నారు. జాతర సందర్భంగా డ్రైవర్లు బస్సులను ఓవర్‌టేక్ చేయకుండా క్రమ పద్ధతిలో వాహనాలను నడపాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశంలేకుండా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, విమల్లయ్య, సూపర్‌వైజర్లు నజీర్, వీరస్వామి, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.



ఆర్టీసీలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్ఎం సుచరిత

# భక్తులతో కిక్కిరిసిన రాజన్న క్షేత్రం


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, ఫిబ్రవరి 16 : దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అశేష భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో రాజరాజేశ్వరస్వామివారికి తొలి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి మహా మండపంలో రుద్రాభిషేకం అన్న పూజ తదితర ఆర్జిత సేవలను రద్దు చేశారు. దీంతో క్యూ లైన్‌లు వేగంగా కదిలి భక్తులకు స్వామివారి దర్శనం కలిగే అవకాశం లభించింది. అనుబంధ ఆలయ మైన బద్ది పోచమ్మ ఆలయం లోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకున్న భక్తులు

# యమధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, ఫిబ్రవరి 16:ధర్మపురిలోని యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులుబొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారలను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోషకుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, దర్శనం చేసుకుంటున్న భక్తులు

## వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్



సిరిసిల్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్ర స్థాయి పదవి వరించింది. ఇప్పటికే వక్ఫ్ బోర్డు డైరెక్టర్లను నియమించగా శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లాలోని గంబీరావుపేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా ఎన్ను కున్నారు. అజ్మతుల్లా హుస్సేన్ 23 ఏళ్లుగా కాంగ్రెస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధిగా పనిచేశారు. జాతీయ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శిగా, కో ఆర్డినేటర్‌గా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.దీంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ బాధ్యతల్లో పనిచేసిన అనుభవం ఉంది. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అజ్మ తుల్లా నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం సమ్మక్క ప్రసాదం

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: మేడారం వెళ్లి సమ్మక్క సారలమ్మలను దర్శించుకోలేని వారి కోసం ఆర్టీసీ ప్రసాదాన్ని ఇంటి వద్దకే అందించనున్నట్లు ఆర్టీసీ కార్గో ఏటీఎం ఎస్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం వెళ్లలేని భక్తులు 299 రూపాయలు చెల్లించి ప్రసాదం కోసం బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ తర్వాత వారికి ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

## ఆసుపత్రిపై దాడి : కేసు నమోదు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 16: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి, వైద్యుడిపై దాడిన చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన అబ్బూరి చిన్న మల్లయ్య మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి బంధువులు ఆసుపత్రిలోని ఫర్నీచర్ ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేశారు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుడి ఫిర్యాదు మేరకు అబ్బూరి మహేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాకేష్‌గౌడ్, అల్వాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడి ఘటనకు నిరసనగా పట్టణంలోని ఐఎమ్ఏ ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులు బంద్ పాటించాయి.

### నకిలీ ధ్రువపత్రాల కేసులో

# పోలీసు కస్టడీకి నిందితులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: వివా దంలో ఉన్న భూమికి నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి విక్రయం పేరిట కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ శివారులోని రేకుర్తిలో వివాదంలో ఉన్న భూమిని నకిలీ పత్రాలతో వేములవాడకు చెందిన గునుకుల రాజిరెడ్డి అనే వ్యక్తికి విక్రయించి అతని వద్ద కోటి 37 లక్షలు కాజేసినట్లు బాధితుడు ఫిర్యాదుతో ఈ నెల 9న 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్, మరో వ్యక్తి ఏలేటి భరత్ రెడ్డిలపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పటి నుంచి జైలులో ఉన్న ముగ్గురు నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీ సులు కస్టడీ పిటిషన్ వేయగా కోర్టు అనుమతిం చింది. ఈ మేరకు ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. అనంతరం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితులు ముగ్గురి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.


సోదాలకు వెళుతున్న పోలీసులు

### ముగిసిన జంగిలి సాగర్ పోలీసు కస్టడీ

మరో వైపున భూకబ్జా, బెదిరిం పులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను మరోమారు కొత్తపల్లి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం శుక్రవారం మళ్లీ జైలుకు తరలించారు.

# కరెంట్ మోటార్ల దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 16: జిల్లాలో వ్యవసాయ బావుల వద్ద కరెంట్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగలను ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన అజ్గర్ పాషా చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. తనకు పరిచయమైన వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం వెలుబల్లికి చెందిన బాసవేణి నాగరాజు, వేములవాడకు చెందిన నీలం మౌనిష్, దండు శ్రీకాంత్‌తో కలిసి జిల్లాలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద ఉన్నటువంటి మోటా ర్లను దొంగిలించారు. ఆ మోటార్లను సోహెల్ అనే వ్యక్తికి విక్రయించారు.

వచ్చిన డబ్బుతో జల్సాల చేసుకు న్నారు. దొంగతనం చేసిన మోటార్లను సోహెల్‌కు ఇచ్చి రావడానికి కార్లు అద్దెకు తీసుకొని వెళ్లే వారు. దొంగతనం చేసిన కరెంటు మోటార్లను శుక్రవారం కారులో కామారెడ్డికి వెళ్లి అమ్మాలనుకున్నారు. మర్రిపల్లి గ్రామ శివారువద్ద రూరల్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. దొంగలించిన 4,78,000 రూపాయల విలువైన 33 కరెంటు మోటార్లు, దొంగతనాలకు ఉపయో గించిన 5 కార్లను, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న కామా రెడ్డికి చెందిన సోహెల్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి ఉన్నారు.

## రాజన్న సేవలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్


కోడె మొక్కు చెల్లించుకుంటున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

వేములవాడ, ఫిబ్రవరి 16: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వ చనం, ఆలయ సూపరింటెండెంట్ బి.తిరుపతిరావు, ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాము లు ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ను స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, యువజన విభా గం నాయకుడు వెంగళ శ్రీకాంత్ గౌడ్, యామ తిరుపతి, పోతు అనిల్, విజయ్ యాదవ్, శ్రీధర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## సింగాపూర్‌లో దొంగల హల్‌చల్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని సింగాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు శుక్రవారం చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రమీల అనే మహిళ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.95 వేలు విలువ చేసే బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి తాళాలను పగలగొట్టి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయిననట్లు గ్రామస్థులు తెలిపారు. దొంగతనంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో

**తంగళ్లపల్లి:** తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. లక్ష్మీపూర్ కాలనీకి చెందిన పసుల నర్సయ్య ఇంటి తాళం పగల గొట్టి బీరువాలో ఉన్న అర తులం బంగారంతోపాటు 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 9 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అట్టెల నర్సయ్య ఇంటి తాళం పగలగొట్టిన దొంగలు రూ.3 వేల నగదును దొంగతనం చేశారు. పక్కనే పసుల మల్లేశం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న సీఐ సదన్‌కుమార్ చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. దొంగల ఆచూకీ కోసం క్లూస్ ఆధారాలు సేకరించింది.

### తాటి చెట్టు పైనుంచి పడి
## గీత కార్మికుడికి గాయాలు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 16: జమ్మికుంట మండలం రంగమ్మపల్లి గ్రామానికి చెందిన బాలసాని శ్రీనివాస్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వృత్తిలో భాగంగా పెద్దంపల్లిలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన తోటి గీత కార్మికులు మెరుగైన చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికుడిని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


## దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 16: కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం... 27 జూలై 2017న వట్టిమల్ల గ్రామానికి చెందిన బండ రాజు, కుమ్మరి మల్లయ్య కలిసి వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేశారు. ఆ సమయంలో కోనరావుపేటకు చెందిన బాబు అకారణంగా బండ రాజుపై బాటిల్, రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో తప్పించుకునేందుకు ప్రయత్నించిన రాజు ప్రహరీ పైనుంచి దూకగా కుడికాలు విరిగిపోయింది. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై రమేశ్‌నాయక్ కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పీపీ సందీప్ వాదించగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ నిందితుడు బాబుపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు.

## విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన పైండ్ల అంజయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జైలు శిక్ష, జరిమానా విధించారు. అంజయ్య విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడిన కేసులో జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి 10,896 రూపాయల జరిమానా లేదా 4 నెలల జైలుశిక్ష విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

## గుండెపోటుతో సీసీఆర్‌బీ ఎస్ఐ మృతి


ఎస్ఐ లింగారెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే ఎస్ఐ శుక్రవారం కరీంనగర్ తిరుమల్‌నగర్‌లో తన ఇంటిలో గుండెపోటుతో మరణించాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురులు ఉన్నారు. లింగారెడ్డి కుటుంబ సభ్యులను అడిషనల్ డీసీపీ సి రాజు పరామర్శించారు. ఎస్ఐ లింగారెడ్డి కామారెడ్డి నుంచి బదిలీపై కరీంనగర్ సీసీఆర్‌బీ ఎస్ఐగా వచ్చారు. గురువారమే ఆయన విధులకు రిపోర్ట్ చేశారు. లింగారెడ్డి అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని, పోలీసుశాఖ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు సీసీఆర్‌బీ ఏసీపీ జి విజయ్‌కుమార్, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాసులు, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, పోలీస్ వెల్ఫేర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దలింగాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

### కాళేశ్వరం జలాలతో
# అన్నపూర్ణ రిజర్వాయర్ నింపాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16: మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌ను కాళేశ్వరం జలాలతో నింపాలని రైతులు డిమాండ్ చేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్ దిగువన వ్యవసాయ భూములు ఉన్న పెద్దలింగాపూర్, అనంతగిరి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పెద్దలింగాపూర్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు ఉంటుందని భావించి పంటలు వేశామన్నారు. రిజర్వాయర్ నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో ఇప్పటికే పంటలు ఎండిపోయాయన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా? అని ప్రశ్నిం చారు. రిజర్వాయర్‌లో నీరు ఉంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు సీపీజీ నీటితో ఏటా పంటలు పండుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, మల్లవ్వ, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ కార్మికుడి మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని గంగానగర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి రెడ్డిపాక మొండయ్య మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య తెలిపారు. ఉదయ్ నగర్‌లో గురువారం సాయంత్రం పెరుగు కొనుగోలు చేసుకుని రాజీవ్ రహదారి దాటుతుండగా మంచిర్యాల నుంచి గోదావరిఖనికి ద్విచక్ర వాహనంపై వస్తున్న మార్కండేయకాలనీకి చెందిన మురళీధర్ అనే వ్యక్తి మొండయ్యను ఢీకొట్టడంతో అతని డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి అల్లుడు చంద్రగిరి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహన దారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల పట్టుబడిన 12 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ ము న్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు, మరొకరికి ఐదు రో జులు, ఇంకొకరికి మూడు రోజుల వంతున జైలుశిక్ష లేదా మొత్తం రూ. 7,500 ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. మిగతా 9 మంది వాహనదారులకు రూ. 14వేలు జరిమానా విధించారని తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మోహన్ గుప్తా చుట్టు పక్కల వారి వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో నిల్వ చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

# కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద సిమెంట్ లారీ బోల్తా

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: కరీంనగర్ శివారులోని రాజీవ్ రహదారిపై కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద గురువారం అర్ధరాత్రి సిమెంట్ లారీ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. గోదావరిఖని వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ ఐలాండ్ వద్ద టర్న్ చేసే సమయంలో అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయని పోలీసులు తెలి పారు. ఐలాండ్ వద్ద రోడ్డుపై భారీ ట్యాంకర్ బోల్తా పడటంతో రాజీవ్ రహదారిపై గోదావరి ఖని నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. రాత్రి నుంచి పలుమార్లు వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోగా పోలీసులు సాయంత్రం ట్యాంకర్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.


బోల్తాపడ్డ సిమెంట్ లారీ

# నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16: జాతీయ యువజన పార్లమెంటు ఉత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహి స్తున్నట్లు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ఎం వెంకటరాంబాబు తెలిపారు. ఈ పోటీలను కొన్ని జిల్లాల వారిగా విభజించి ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహి స్తోంది. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో గెలిచిన వారు జాతీయస్థాయి పోటీలకి ఎంపిక అవుతారు.జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రెండు లక్షల నగదు, రెండో బహుమతి లక్ష యభైవేయిలు, మూడో బహుమతి లక్ష రూపాయలు, ప్రోత్సాహక బహుమతులు ఇద్దరికి 50 వేల చొప్పున ఇవ్వబడతా యని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ 2024 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని, మై యువ భారత్ అనే కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నల్గొండ జిల్లాల అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు www.mybharat.gov.in వెబ్‌సైట్ ద్వారా అనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు 20వ తేదీ ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా యువజన అధికారి, నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ ఆఫీసు సమయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 : మండలంలోని కాంగ్రెస్ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5లక్షల ఎన్ఆర్ఈ జీఎస్ నిధులతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు అనిరెడ్డి మారుతిరెడ్డి, నాయకులు మారు గంగారెడ్డి, మారు సాయిరెడ్డి, జక్కని పరంధాములు, ఇంద్రాల రవి, అనిరెడ్డి ఆనంద్‌రెడ్డి, పులింటి స్వామికుమార్ పాల్గొన్నారు.

## 'ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఆరోపణలు'

ఎండపల్లి, ఫిబ్రవరి 16 : ప్రజల్లో పెరిగిన ప్రజాదరణను ఓర్వలేకనే నిధులు దుర్వినియోగం చేశానని ఎండపల్లి ఎంపీటీసీ బషీర్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఎండపల్లి తాజా మాజీ సర్పంచ్ మారం జెలెందర్ రెడ్డి అన్నారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు నిరూపణ అయితే ప్రజల ముందు ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తప్పు చేస్తే తమపై రాజ్యాంగం ప్రకారం చర్యలు తీసుకోవాలి కాని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. తాను నిధులు దుర్వినియోగం చేస్తే గ్రామ సభలో ఏనాడైనా వచ్చి అడిగిన దాఖలాలు కూడా లేవని, గ్రామ సభకు కూడా ఏనాడు హాజరుకాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ మైలారపు సతీష్, మారం జగన్ మోహన్ రెడ్డి, ఏలేటి కృష్ణా రెడ్డి, బైకాని రవి, పాల్గొన్నారు.

## కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కొప్పుల పూజలు



కొప్పుల దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఫిబ్రవరి 16: విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయం వద్ద ఈశ్వర్ దంపతులకు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి, శేష వస్త్రం, తీర్థ, ప్రసాదాలు వితరణ జరిపారు.

## ఎల్‌వోసీ అందజేత

ధర్మపురి, ఫిబ్రవరి 16: పట్టణానికి చెందిన ఇనుగుర్తి హరీష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరగా రూ. 2.30లక్షలు ఎల్‌వోసీని శుక్రవారం అందించారు. హరీష్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిగా ఉండి వైద్యం అందడం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు తెలియజేయగా వెంటనే నిమ్స్ వైద్యులతో ఫోన్లో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. తన పీఏ ద్వారా ఎల్‌వోసీ అందించారు.

## విద్యార్థుల యోగాసనాలు

కోరుట్ల, ఫిబ్రవరి 16 : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మన గుడి కార్యక్రమంలో భాగంగా యోగా గురువు కస్తూరి రాజన్న విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. కల్లూరు రోడ్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సూర్య నమస్కారాలు, ఆసనాలు వేయించారు. సర్వ జీవులకు ఆరోగ్యం ప్రసాదించేది సూర్య భగవానుడని, ఆయుష్షు ప్రసాదించేది బ్రహ్మదేవుడు, ఐశ్వర్యం ఇచ్చేది శివుడని, సౌభాగ్యం జగన్మాత వల్ల ప్రసాదించబడుతుందని హిందూప్రచార పరిషత్ జిల్లా కన్వీనర్ మంచాల జగన్ పేర్కొన్నారు. ఆదిత్య హృదయ పారాయణం, కీరాన్నం నివేదన వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆసనాల వల్ల చేకూరు ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గడీల భూపతి, ఉపాధ్యాయులు మోహన్, చావ్లా లక్ష్మీనారాయణ, నాగరాజు, కృష్ణమోహన్‌రావు తదితరులు ఉన్నారు.

## సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యం



వెల్లుల్లలో వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీపీ సాయిరెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 : సమిష్టితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల గ్రామాభివృద్ధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నీటి వాటర్ ప్లాంటును వీడీసీ అధ్యక్షుడు తొగిటి అంజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రత్యేకాధికారులకు ప్రజా ప్రతినిధులు, నాయకులు సహకరించాలన్నారు. గ్రామా ల్లోని సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అభివృద్ధి పనులకు పార్టీలకు అతీతం గా సహకరించలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ గౌడ్, నాయకులు మంచాల శివ, రాజేష్, నూతుల రాజారెడ్డి, లక్ష్మరెడ్డి, గొల్లమాడ శానయ్య, నరేష్, విష్ణు, కళ్యాణ్, రఘు, నర్సయ్య పాల్గొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి చేయూత

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16 : జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి మండల కేంద్రానికి చెందిన సుప్రియ అనే యువతి విహానికి పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు తమ వంతుగా చేయూతనందించారు. ఈ సందర్భంగా శుక్రవారం సత్యసాయి ఆలయ ఆవరణలో యువతి వివాహానికి కావలిసిన సామగ్రితో పాటు బంగారు పుస్తెలు, వెండి మట్టెలు తదితర వస్తువులను అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, కోటగిరి మహేందర్, సామ సునీల్ తదితరులు ఉన్నారు.

## జగిత్యాలలో షార్ట్ సర్క్యూట్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం సమీపంలో ఉన్న ఓ ఇంటిలో శుక్రవారం ప్రమాదావశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంటిలోపల భారీగా మంటలు ఎగిసిపడడంతో ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంతో జగన్ అనే వ్యక్తి చెందిన ఇంటిలో విలువైన సుమారు 5 లక్షలుగా వస్తువులు అగ్గికి బుగ్గాయయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

## అధికారులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్, ఫిబ్రవరి, 16 : మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను కాంగ్రెస్ నాయకులు శాలువలతో సన్మానించారు. మల్లాపూర్ ఎస్సైగా కిరణ్‌కుమార్‌గౌడ్, ఎంపీడీవోగా నల్ల రాజేందర్‌రెడ్డిలు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారిని శుక్రవారం మర్యాదపూరకంగా నాయకులు శాలువలతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు హన్మండ్లు, భైరవేణి శశి గౌడ్, జవిడి రాజారెడ్డి, మిణుగు నరేష్, వినయ్‌రెడ్డి, గడ్డం నరేష్‌రెడ్డి, సాంగ సందీప్‌యాదవ్, నాగరాజ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి బండి సంజయ్ కృషి

కోనరావుపేట, ఫిబ్రవరి 16: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కోనరావుపేట మండల అభివృద్ధికి కృషి చేశారని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్రావు, మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం విలేకరుల సమావేశంలో అభివృద్ధికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. బండి సంజయ్ మండలానికి ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ నాయకులు విమర్శించారన్నారు. మండల అభివృద్ధికి 6.65 కోట్లు పీఎంజీఎస్‌వై వచ్చాయన్నారు. 26 లక్షలు మండల అభివృద్ధికి ఖర్చు చేశారన్నారు. ఉపాధి హామీ, రైతు వేదికలు, శ్మశాన వాటికలు, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే నిర్మించారన్నారు.

# సార్వత్రిక సమ్మె విజయవంతం

●జిల్లా కేంద్రంలో పలు సంఘాలు, యూనియన్ల నిరసనలు

●కలెక్టరేట్ ఎదుట పలు ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ధర్నా

●సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపిన ఆటోవాలాలు




కలెక్టరేట్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ మతతత్వ విధానాలను ఖండిస్తూ జరిగిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా సీఐటీయూ, రైతుకూలీ సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ట్రేడ్ యూనియన్‌ల బాధ్యులు మాట్లాడుతూ బీజేపీ కార్పోరేట్, మతోన్మాద విధానాలపై ఛార్జీషీట్ ప్రకటించాలని పిలుపునిచ్చారు. మోదీ స్విస్ బ్యాంక్ నుంచి నల్లధనం తెచ్చి, రూ.15లక్షలు ఖాతాల్లో జమచేస్తామని ఇచ్చిన హామీ నీటమూటలాగా మారిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు వర్తింపజేసి. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికి రోజువారి వేతనం కనీసం రూ. 600గా నిర్ణయించాలన్నారు. 2014 స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు, బోనస్ చెల్లిస్తామన్న హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టు వ్యవస్థను ప్రోత్సహించి శ్రమ దోపిడీ చేస్తుందని, కోట్లాది కార్మికులకు వర్తించే ఎస్ ఐపీఎఫ్ పెన్షన్‌ను రూ.10వేలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ పే కమిషనర్‌ను నియమించకుండా జాప్యం చేస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేసి, తిరిగి యధావిధిగా పాత కార్మిక చట్టాలను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టినటువంటి స్కీమ్‌లను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ట్రేడ్ యూనియన్‌ల నాయకులు సారంగపాణి, రమేష్, సులోచన, చౌదరి, శారద, పులి మల్లేష్, సుజాత, రజిత, లత, గౌరమ్మ, వెంకటాచారి, భారతమ్మ, సుధారాణి, సురేష్, చంద్రయ్య, శేఖర్, సలీం, హరీష్, వినోద్, కొండ రాజన్న, మహ్మద్ తదితరులున్నారు.

●మహాలక్ష్మీ పథకంతో తమ జీవనవిధానం కష్టతరంగా మారినందున ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డీజిల్ ఆటో సంక్షేమ సంఘ బాధ్యులు శెట్టి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమ్మె పిలుపులోభాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలో ఆటోలు, జీపులు, టాటా మ్యాజిక్ డ్రైవర్‌లు బంద్‌ను పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకంతో తమ ఉపాధి దెబ్బతిన్నందున నెలకు రూ.15వేల జీవనభృతి ఇవ్వాలని, ఇప్పటివరకు మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలకు రూ. లక్ష ఆర్థికసాయం ప్రభుత్వం తరుపున అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘ బాధ్యులు శ్రీనివాస్, హైమద్, గట్టు రాజన్న, సామల్ల ప్రసాద్, పాల్గొన్నారు.

●అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపుమేరకు అఖిల భారత రాష్ట్ర ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఆవరణలో భోజన విరామ సమయంలో సమ్మెకు మద్దతుగా నిరసన తెలిపారు. సంఘ బాధ్యులు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి మాట్లాడారు. ఆయా సంఘా బాధ్యులు హరి అశోక్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, రాజేంధర్, రవికుమార్, రాజేశం, మధుకర్, ప్రమోద్ తదితరులున్నారు.

●దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ జగిత్యాల జిల్లా శాఖ మద్దతు ప్రకటించింది. సమ్మె పిలుపులో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, సమ్మెకు మద్దతుగా నిరసన తెలిపారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు శ్యాం సుందర్, అంబటి భూమేశ్వర్, ఎన్నం రాంరెడ్డి, మానుపాటి బన్న, శ్రీనివాస్, ఆగమయ్య, జయంత్, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులున్నారు.

**మెట్‌పల్లి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా మెట్‌పల్లి పట్టణంలో నిరసన ర్యాలీ, రాస్తారోకోను కార్మిక సంఘాలు నిర్వహించారు. శుక్రవారం దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా ఏఐటీయూసి నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, జాతీయ రాహదారి మీదుగా ఆర్డీవో ఆఫీసు వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీగా చెరుకున్నారు. ఆర్డీవో కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన తెలిపి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకలు పద్మ, సుమలత, బర్ల లక్ష్మణ్, శ్రీకాంత్, మధురమ్మ, సరస్వతి, గణపతి, భవాయి, సోమిడి రాజయ్య, కాంగ్రెస్ నాయకులు జెట్టి లింగం, నర్సగౌడ్, అందే మారుతి, రాజాగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

●ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యవసాయ, కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెకు యూఎస్‌పీసీ నాయకుడు, ఉపాధ్యాయుడు తులసి ఆగమయ్య మద్దతుగా నిరసన ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల భోజన విరామ సమయంలో సమ్మెకు మద్దతుగా ప్లకార్డులతో నిరసన తెలిపారు.



మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు




కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

**మెట్‌పల్లి రూరల్:** ఉద్యోగ, వ్యవసాయ, కార్మిక సంఘాల సమస్యల పరిష్కా రానికి దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా శుక్రవారం భోజన విరామ సమయంలో ఎల్ఐసీ కార్యాలయం ముందు అధికారులు నిరసన తెలిపారు. మెట్‌పల్లి ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు కోటగిరి ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉద్యోగ, వ్యవసాయ, కార్మికుల విధానాలపై అవలంబిస్తున్న వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీ యూ సంఘాల పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ అక్బర్, నాయకులు శ్రీనివాస్, టీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కోరుట్ల:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత విధానాలను నిరసిస్తూ శుక్రవారం ఏఐటీయుసీ నాయకులు నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత హామీలిచ్చి ప్రజలకు మోసం చేశారని ఆరోపించారు. ప్రతీ ఏటా ఉద్యోగాల కల్పన చేస్తామని ఇచ్చిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలైన మధ్యాహ్న భోజనం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లును కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికునికి రు. 26 వేల వేతనం, పెన్షన్‌దారునికి రు. 10 వేల చొప్పున అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, రాజ్‌కుమార్, సాయిలు, సుగుణ, పద్మ, భాగ్య, చెన్నవేని దశరథం, సీపీఎం నాయకులు చెన్న విశ్వనాథం పాల్గొన్నారు.

**పెగడపల్లి:** దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇచ్చిన సమ్మె పిలుపు పెగడపల్లి మండలంలో శుక్రవారం విజ యవంతమైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విదానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో కార్మికులు నిరసన తెలిపి, పేద వాళ్లకు విద్య, వైద్యం, కూడు గుడ్డ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్, రాచర్ల సురేష్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న జ్యోతి స్పోర్ట్స్ మీట్-2024

### భారీగా హాజరై పాల్గొన్న క్రీడాకారులు



స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవం గౌరవవందనం నిర్వహిస్తున్న క్రీడాకారులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 16: పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ విద్యార్థులకు స్థానిక గీతా విద్యాలయం మైదానంలో శుక్రవారం జ్యోతి అనూవల్ స్పోర్ట్స్‌మీట్-2024 పేరిట క్రీడాపోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు ముఖ్య అతిధిగా జగిత్యాల జిల్లా ట్రస్మా అధ్యక్షుడు బోయినిపెల్లి శ్రీధర్‌రావు, ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఒలంపిక్ క్రీడా జ్యోతితో పరుగు తీసి పోటీలను ప్రారంభించారు. శాంతికి చిహ్నమైన పావురాన్ని ఎగరవేసి, స్కౌట్ అండ్ గైడ్స్ గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ప్రదానం అన్నారు. మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి క్రీడలు దోహదపడతాయన్నారు. డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ ప్రతి యేడాదిలాగే ఈ సారి సైతం స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. క్రీడల్లో విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీసి, ప్రతిభావంతులుగా తీర్చడమేల లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ముగింపు వేడుకల్లో విజేతలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు రజిత, అజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ

కథలాపూర్, ఫిబ్రవరి 16 : భువనగిరి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో అంబారిపేటకు చెందిన యేంజాల కీర్తన, చింత శరణ్య ప్రతిభ కనబరిచారు. వీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీంకు ప్రాతినిధ్యం వహించి జట్టును గెలిపించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు అందుకున్న ప్రశంసా పత్రాలతో ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, పీఈటి వాసాల రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## సమగ్ర కులాల సర్వే బిల్లు పట్ల హర్షం

కథలాపూర్, ఫిబ్రవరి 16 : రాష్ట్ర అసెంబ్లీలో సమగ్ర కులాలు, బీసీ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టడం పట్ల రాష్ట్ర మున్నూరుకాపు రైతు విభాగం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ హర్షం వెలిబుచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలనలో బీసీ బిల్లుకు మోక్షం లభించిందని ప్రతిపక్షాలు అసెంబ్లీలో జరుగుతున్న చర్చకు సహకరించాలని కోరారు. కులాల సర్వే వల్ల బీసీ కులాలకు న్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ప్రాంగణ నియామకాల్లో వెటర్నరీ విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఫిబ్రవరి 16 : ప్రాంగణ నియామకాల్లో కోరుట్ల వెటర్నరీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ నెల 12న ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ప్రతిభ కనబరిచి 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అసోసియేటెడ్ డీన్, ప్రొఫెసర్ తక్కళ్ళపల్లి మాధవరావు తెలిపారు. ఇటీవల జీవీకె సంస్థ నిర్వహిం చిన నియామకాల్లో 10 మంది వెటర్నరీ వైద్యులుగా ఉద్యోగాలు సాధించినట్టు చెప్పారు. సంస్థ తరపున ప్రతినిధులుగా అశోక్‌రావు, రంగారావు, సత్యప్రసాద్ వ్యవహరించారు. అదేవిధంగా కోఆర్డినేటర్‌గా రాధాకృష్ణ వ్యవహరించారని తెలిపారు.

## ఎమ్మెల్యే పరామర్శ

సారంగాపూర్, ఫిబ్రవరి, 16 :సారంగాపూర్ ఎంపీపీ కోల జమున మామ, మండల రైతు బందు సమితీ కన్వీనర్ కోల శ్రీనివాస్ తండి శుక్రవారం మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట గుర్రాల రాజేందర్‌రెడ్డి, గురునాథం మల్లారెడ్డి, లింగారెడ్డి, రమేష్ ఉన్నారు.

## డీఎస్పీకి సన్మానం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 16 : మెట్‌పల్లి డీఎస్పీగా ఉమామహేశ్వరరావు ఇటివల నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో పట్టణంలోని బీజేపీ నాయకులు శాలువలతో సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లెందుల కృష్ణమాచారి, తొగిటి ఎంబేరు మనార్, కొండ్లెపు శ్రీనివాస్, పిన్నంశెట్టి గంగాధర్, జగన్, బండారి రమేష్, ఓంకారి అంజయ్య, మరాఠీ అంజయ్య, పాల్గొన్నారు.

## బీసీ కుల గణన బిల్లు పట్ల హర్షం

కోరుట్ల, ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లు తీర్మాణం ప్రవేశపెట్టి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని బీసీ సెల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీ అభివృద్ధి, సంక్షేమంకు కట్టుబడి ఉందని తెలిసిపోయిందని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా బీసీ రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని చెప్పారు.

## ఘనంగా కైలాస గౌరీ వ్రతం

ధర్మపురి, ఫిబ్రవరి 16: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కైలాస గౌరీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణానికి చెందిన 12 మంది ఆర్య వైశ్య జంటలు ఈ వ్రతాలు ఆచరించారు. తమ కుటుంబ సౌభాగ్యం కోసం పసుపు, కుంకుమ కుప్పలు పోసి పంచి పెట్టారు. ఈ వ్రతాన్ని ఆచరించిన మహిళలకు సకల సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం ఉంది.

# నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### అసెంబ్లీ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 16 : కోరుట్ల నియోజక వర్గంలోని సమస్య ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని అసెంబ్లీ స మావేశంలోని జీరో అవర్‌లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇండ్లు లేని వారి కోసం గృహలక్ష్మి పథ కం ద్వారా కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 1000 ప్లాట్లు గుర్తించి అర్హులైన వారికి అందజేసే సమయంలోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడం వల్ల నిలిపివేశారన్నారు. గుర్తించి ప్లాట్‌ల స్థలాన్ని కొంత మంది రాజకీయా ప్రయోజనాల కోసం కబ్జా చేయాలని చూస్తున్నారని, వెంటనే ప్లాట్‌లను అర్హులైన వారికి ఎంపీ ఎలక్షన్ నోటిఫికేషన్ రాకమందే పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు. మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలలో నిర్మాణాలు చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ల నిర్మాణం 90శాతం పూర్తయ్యాయని, పూర్తిగా నిర్మాణాలు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని ఆర్థికశాఖ మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల ఒకే భవనంలో ఉన్నాయని, పేసీవైజ్ ద్వారా వాటిని విభజించి శిథిలావ్యవస్థలో ఉన్న జూనియర్ కళాశాల భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కూల్చివేసి నిర్మాణం చేపట్టిందన్నారు.

అదే విధంగా శిథిలా వస్థలో ఉన్న హైస్కూల్ భవన నిర్మాణానికి నిధు లు మంజూరు చేయాలని కోరామన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఎన్నో ఆశలతో అసెంబ్లీకి వచ్చానని కానీ సమావేశాల్లో ఎవరు వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడకూడదని సభపతిని కోరినట్లు తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే నిర్వాసితుల సమస్యలు పరిష్కారం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16: గత ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. వేములవాడ మండలం అనుపురంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదిహేను ఏళ్లుగా నిర్వాసితుల సమస్యలపై గత ప్రభుత్వ నేతలు అసెంబ్లీలో చర్చించలేదన్నారు. నిర్వాసితుల ప్యాకేజీ గురించి ప్రస్తావించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలో మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిర్వాసితుల గురించి అసెంబ్లీలో మాట్లాడడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల ఇస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితుల తరుపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆటోల బంద్ విజయవంతం

రాయికల్, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథ కానికి నిరసనగా రాయికల్ మండలం ఆటో యూనియన్ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఒక రోజు ఆటోల బంద్ కార్యక్రమం శుక్రవారం విజయ వం తమైంది. ఆటో కార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని అన్నారు. జీవనభృతి కింద నెలకు రూ.15 వేలు కల్పించాలని, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన వ్పటి నుంచి 23 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకొని రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మా డ్రైవర్ కుటుంబాల ఓట్ల ద్వారా గుణపాఠం చెబుతా మని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, క్యాషియర్ సల్లు, డైరెక్టర్‌లు ఎస్కే మోసిన్, కొక్కు గంగారెడ్డి, ఎం.డి.సమి, ఎండీ జలీల్, రాజం పాల్గొన్నారు.

**కొడిమ్యాల :** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆటో కార్మికులు తమకు ప్రభుత్వం జీవన భృతి కలిపించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్, పూడూర్, దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఆటో కార్మికులు బ్యానర్లతో నిరస వ్యకతంచేస్తు తమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆటో కార్మికులు ప్రభుదాస్, ఉపెందర్‌రెడ్డి, సాజన్, లక్ష్మన్, సతీష్ ఉన్నారు.

# సమష్టి కృషితో సమస్యలు పరిష్కారం

### గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్




సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు

జగిత్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని జగిత్యాల గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నీటి పారుదల శాఖ చీప్ ఇంజనీర్ కార్యాలయంలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమన్ని నిర్వహించారు. పలువురు గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేయడంలో గెజిటెడ్ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎప్పటికప్పుడు కృషి చేస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ప్రతీ గెజిటెడ్ అధికారి ఈనెల 18వ తేదీలోపు అసోసియేషన్ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేంద్ర పరిశీలకులు ఏలూరి శ్రీనివాస్, సత్యనారాయణ పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు అశోక్, కం దుకూరి రవి బాబు, రాజేందర్ రెడ్డి, విజేందర్, సలీం, సతీష్, శ్రీనివాస్, అశ్విన్, విశ్వాన్, అంజిత్ రెడ్డి, సుజాత, లక్ష్మీ, జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.